సాక్షి అనంతపురం

సోమవారం। 4 । ఆగస్టు । 2025



వీధివీధినా పశువులే.. 8లో

ఉమ్మడి జిల్లాలోని ప్రతి మున్సిపాలిటీలో వీధి పశువుల బెడద తీవ్రమైంది. అధికారుల నిద్రమత్తుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



టమాట కిలో రూ.40

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.40 పలికింది. కనిష్టం రూ.24, సరాసరి రూ.32 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.1°/21.6°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'



అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో సమర్పించాలన్నారు. అర్జీతో పాటు ఫోన్, ఆధార్ నంబర్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. సమర్పించిన అర్జీల స్థితిని కాల్‌సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ అర్జీలు సమర్పించవచ్చని తెలియజేశారు.

13న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయం

అనంతపురం సిటీ: ఉభయ జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 13న నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు మొదలుపెట్టారు. ఇందుకు సంబంధించిన ఫైలును సిద్ధం చేసి చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మకు పంపగా.. ఆమె పరిశీలించి ఆమోదం తెలిపారు. స్థాయీ సంఘం-1, 2, 4, 7(ఆర్థిక, ప్రణాళిక/గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు ప్రధాన హాలులో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నారు. అదనపు సమావేశ భవన్‌లో స్థాయీ సంఘం-3, 5, 6(వ్యవసాయం/ఐసీడీఎస్/సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు నిర్వహించనున్నారు. సీఈఓ శివ శంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో సమావేశాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని ఇప్పటికే ఆయా శాఖల అధికారులకు పంపారు. జిల్లా స్థాయి అధికారులు కచ్చితంగా సమగ్ర సమాచారంతో హాజరుకావాలని పేర్కొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతుల ధర్నా



గంగవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేపట్టిన రైతులు

బెళుగుప్ప: మండల పరిధిలోని గంగవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల లో ఓల్టేజీతో పాటు విద్యుత్ సరఫరాలో కోతలు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో బోరుబావుల మోటార్లు సరిగా ఆడటం లేదని వాపోయారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని చెప్పారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరిస్తామని ఏఈ గంగాధర్ హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

☛ శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం కాళసముద్రంలో ఇటీవల పీర్ల పండుగ సందర్భంగా ఇద్దరు దళిత మైనర్లపై అదే గ్రామానికి చెందిన మరో ముగ్గురు బాలురు గంజాయి మత్తులో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. తమ గ్రామంలో విచ్చలవిడిగా గంజాయి దొరుకుతోందని, యువత చెడిపోతోందని స్వయాన గ్రామస్తులు పోలీసు అధికారుల ఎదుటే వాపోయారు.

☛ రాయదుర్గం మండలం టీ. వీరాపురంలో కొన్ని రోజుల క్రితం టీడీపీ నాయకుడు చిలకరి వన్నూరుస్వామి మామిడి తోటలో గంజాయి మొక్కలు పెంచుతూ పట్టుబడ్డాడు. వన్నూరుస్వామి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్య అనుచరుడు. విశ్వసనీయ సమాచారంతో దాడులు నిర్వహించిన పోలీసులు 7.25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

☛ ఇటీవల అనంతపురం నగరంలోని పాతూరులో ఇద్దరు యువకులు గంజాయి సేవించి హల్‌చల్ చేశారు. ఓ యువకుడిపై విచక్షణారహితంగా దాడి చేశారు.అనంతరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని స్టేషన్ వద్దే 'దమ్ముంటే పట్టుకోరా షెకావత్.. పట్టుకుంటే వదిలేస్తా' అంటూ సినిమాలోని డైలాగ్ చెప్పడం కలకలం రేపింది. ఈ మూడే కాదు.. ఇటీవల ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడ చూసినా గంజాయి గుప్పుమంటోంది. బతుకులను చిత్తుచేస్తోంది.



- ఉమ్మడి అనంతపురం జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి లభ్యం
- ఇప్పటికే ఊరూ వాడా ఏరులై పారుతున్న మద్యం
- మత్తులో యువత, పేదలు చిత్తు
- పెరిగిన గొడవలు, హత్యాయత్నాలు, హత్యలు

గంజాయ్ గుప్పు!

అనంతపురం: కూటమి ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మద్యం ఏరులై పారుతోంది. లిక్కర్ షాపుల పక్కనే పర్మిట్ రూములు ఏర్పాటు చేయడం, ఊరూరా బెల్టు షాపులు ఏర్పాటు కావడం తదితర కారణాలతో మద్యం అమ్మకాలు గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగాయి. ఈ క్రమంలోనే గంజాయి కూడా విచ్చలవిడిగా లభ్యమవుతుండడంతో సామాన్యులు మత్తులో జోగుతున్నారు. గంజాయికి బానిసలై యువత తమ జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు.

విద్యా సంస్థలే లక్ష్యం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) దెబ్బకు తోక ముడిచి రాష్ట్రం విడిచిపెట్టిన మాఫియా.. ఉమ్మడి జిల్లాలో దర్జాగా గతేడాది అడుగు పెట్టింది. గంజాయిని విద్యార్థులకు అలవాటు చేసి వ్యాపారాన్ని విస్తరింపజేస్తోంది. పాన్ షాపులు, హోటళ్లు, టీ కేఫ్‌లు, సంచార వర్తకులు.. ఇలా పలువురిని నెట్‌వర్క్‌లో భాగస్వాములుగా చేసుకుని చిన్న చిన్న ప్యాకెట్లలో గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. 10 గ్రాముల ప్యాకెట్ రూ.500 నుంచి రూ.1,000 వరకు విక్రయిస్తున్నారు.కొన్ని రోజుల క్రితం అనంతపురం జిల్లాకేంద్రానికి కూతవేటు దూరంలో 20 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు గంజాయి సేవిస్తూ పోలీసులకు పట్టుబడగా.. తల్లిదండ్రులు, కళాశాల ప్రతినిధుల సమక్షంలో వారికి పోలీసు ఉన్నతాధికారి కౌన్సెలింగ్ ఇచ్చారు.



కాళసముద్రంలో మత్తులో వీరంగం సృష్టిస్తున్న ఓ మైనర్ (ఫైల్)

జవసత్వాలు లేని ఈగల్..

గంజాయి, డ్రగ్స్ దందాకు అడ్డుకట్ట వేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'సెబ్'ను ప్రత్యేకంగా నెలకొల్పింది. 'సెబ్'కు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పజెప్పి రెండు దశల్లో 'ఆపరేషన్ పరివర్తన్' విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకుంది. ఇలా సత్ఫలితాలిచ్చిన 'సెబ్'ను కూటమి ప్రభుత్వం వచ్చాక ఏకపక్షంగా రద్దు చేసింది. దీనిపై విమర్శలు రావడంతో ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) పేరుతో ఓ విభాగాన్ని నెలకొల్పింది. కానీ 'ఈగల్' అంతగా ప్రభావం చూపడం లేదనే విమర్శలు అంతటా వినిపిస్తున్నాయి. గంజాయి బారిన పడిన యువతను తిరిగి సన్మార్గంలో పెట్టేందుకు డీ-అడిక్షన్ కేంద్రాలకు గత ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించగా, కూటమి ప్రభుత్వం మాత్రం అరకొరగానే విదల్చడం గమనార్హం.



గొడవలు నిత్యకృత్యం

చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ప్రతి పంచాయతీలో, ప్రతి ఊళ్లో, కుగ్రామంలో సైతం బెల్టు షాపులు వెలిశాయి. వీధి వీధినా కిరాణా కొట్లతో పోటీ పడుతూ బెల్టుషాపులు పుట్టుకొచ్చాయి. పట్టణాల్లో బార్ల వద్దే పర్మిట్ రూములను ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. వాట్సాప్ ద్వారా అడ్రెస్ పెట్టి డబ్బులు ఆన్‌లైన్‌లో చెల్లిస్తే ప్రత్యేకంగా డోర్ డెలివరీ సౌకర్యం కూడా కల్పించారు. రాత్రి వేళ మద్యం అమ్మకాల కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకున్నారు. ఇదే క్రమంలో గంజాయి విచ్చలవిడిగా లభ్యమవుతుండడంతో పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా మత్తులో జోగుతున్నాయి. ఈ క్రమంలో పల్లెల్లో గొడవలు, హత్యాయత్నాలు, హత్య ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో పేద కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి.

టీబీ డ్యాం @ 80 టీఎంసీలు



నీటితో కళకళలాడుతున్న టీబీ డ్యాం

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయంలో 80 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు టీబీ బోర్డు అధికారులు తెలిపారు. ఆదివారం జలాశయంలోకి 23,938 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఈ క్రమంలో 2 క్రస్ట్ గేట్లు రెండు అడుగుల మేర ఎత్తి 23,900 క్యూసెక్కుల నీటిని నదికి వదులుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో 1,633 అడుగుల నీటి నిల్వకు గాను 1,626.06 అడుగులకు నీరు చేరుకుంది. ఇన్‌ఫ్లో 23,938 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 23,900 క్యూసెక్కులుగా నమోదవుతోంది. ఇదే క్రమంలో ఆంధ్రా సరిహద్దులోని 105వ కిలోమీటర్ వద్ద హెచ్చెల్సీలో 1,240 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

అలరించిన సంగీత కచేరీ



సంగీత కచేరీ నిర్వహిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా జోన్-6 దేశాలైన యూరప్, కెనడా దేశాల భక్తులు ఆదివారం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తికి విచ్చేశారు. సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయిని కొనియాడుతూ సాగిన సంగీత కచేరీ భక్తులను అలరించింది.

నిర్లక్ష్యానికి నిండుప్రాణం బలి



ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు



రాధమ్మ మృతదేహం

అనంతపురం మెడికల్: ఓ డాక్టర్ నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలిగొంది.కుటుంబీకులు, బంధువులకు తీరని శోకం మిగిల్చింది. గైనకాలజిస్టు చేయాల్సిన శస్త్రచికిత్సను ఓ సర్జన్ చేయడంతో అధిక రక్తస్రావం జరిగి చివరకు గర్భిణి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. వైద్యుడి నిర్లక్ష్యంతోనే గర్భిణి మృతి చెందిందంటూ మృతురాలి కుటుంబీకులు ఆస్పత్రి వద్ద పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. వివరాలు.... బుక్కరాయసముద్రం మండలం చదళ్లకు చెందిన మల్లికార్జున, రాధమ్మ (29) దంపతులకు అమల, సాయి సంతానం. రాధమ్మ మరోసారి గర్భం దాల్చింది. ప్రస్తుతం ఐదో నెల. గర్భంలోని బిడ్డ విషయంలో సమస్య తలెత్తడంతో ఇటీవల నగరంలోని ఓ గైనకాలజిస్టును సంప్రదించారు. అయితే, శస్త్రచికిత్స చేయడానికి గైనకాలజిస్టు నిరాకరించారు. దీంతో ఈ నెల ఒకటో తేదీన నగరంలోని సాయికృప ఆస్పత్రికి మల్లికార్జున, రాధమ్మ వెళ్లారు. అక్కడ ఆమెకు డాక్టర్ వెంకటరమణ నాయక్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, జీజీహెచ్) కొన్ని మందులిచ్చి ఆదివారం రమ్మన్నారు. దీంతో రాధమ్మ ఆదివారం ఉదయం ఏడు గంటల సమయంలో ఆస్పత్రికి రాగా, గంట వ్యవధిలోనే గర్భసంచి తొలగించాలంటూ డాక్టర్ వెంకటరమణ నాయక్ ఆపరేషన్ ప్రారంభించారు. కాసేపటికే అధిక రక్త స్రావం జరిగి రాధమ్మ ప్రాణాలు విడిచింది.

బంధువుల ధర్నా..

వైద్యుడి నిర్లక్ష్యంతోనే రాధమ్మ మృతి చెందిందంటూ కుటుంబీకులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఆస్పత్రిలో ఫర్నీచర్ ధ్వంసం చేశారు. వైద్యుడిపై దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనుపమజేమ్స్ వెంటనే ఆస్పత్రికి చేరుకున్నారు. గైనకాలజిస్టు చేయాల్సిన సర్జరీ మీరెందుకు చేశారని డాక్టర్ వెంకటరమణ నాయక్‌ను ప్రశ్నించగా.. ఆయన నీళ్లు నమిలారు. అనంతరం ఆస్పత్రిని డీఎంహెచ్‌ఓ సీజ్ చేశారు.

అనుమతులు తిరస్కరించినా..

ఏడాది క్రితం కూడేరుకు చెందిన ఓ మహిళా రోగి ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చారు. ఆమెను అక్కడి నుంచి తీసుకెళ్లి శ్రీనివాస్‌నగర్‌లోని లావణ్య హాస్పిటల్ (ప్రస్తుత సాయికృప ఆస్పత్రి) లో సర్జరీ చేయగా.. అది కాస్తా వికటించింది. చివరకు ఆమె కర్నూలులో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు చేయగా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలతో ఆస్పత్రిని అప్పట్లో సీజ్ చేశారు. ఇటీవల అదే చోట సాయికృప పేరున ఆస్పత్రికి దరఖాస్తు చేసుకోగా ఆరోగ్యశాఖాధికారులు తిరస్కరించారు. అయినా, గుట్టుచప్పుడు కాకుండా ఆస్పత్రి నడుపుతూ శస్త్రచికిత్సలు ప్రారంభించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

తల్లి లేని బిడ్డలై..

రాధమ్మ మృతితో ఆమె ఇద్దరు బిడ్డలు తల్లిలేని వారయ్యారు. ఆస్పత్రిలో తల్లికి ఏం జరిగిందో తెలియక 'అమ్మా..అమ్మా' అంటూ వారు అంటుండం అక్కడున్న అందరినీ కంటతడి పెట్టించింది.

మాటలు జాగ్రత్త సునీతమ్మా

- నిన్ను చూసి మీ పార్టీ వాళ్లు, మీ కులం వాళ్లే భయపడుతున్నారు
- 1998-99లో నీ భర్త ఏరోజైనా రాత్రిపూట నిద్రపోయాడా?
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: 'రాప్తాడు నియోజకవర్గంలో నువ్వు చేపట్టిన హంద్రీ-నీవా కాలువ కాంక్రీట్ లైనింగ్ పనులతో 2 లక్షల ఎకరాలకు పైగా భూములు బీడుగా మారబోతున్నాయి. 40-50 వేల రైతు కుటుంబాలను నేల కూల్చుతున్నావు. శత్రువులతో నీ భర్త ఫ్యాక్షన్ చేసి ఉండొచ్చుకాని నువ్వు మాత్రం తడిగుడ్డ అవసరం లేకుండా గొంతులు కోస్తున్నావు. నీ కంటే నీ భర్త పదిరెట్లు మేలని మీ పార్టీ వాళ్లే మాట్లాడుకుంటున్నారు' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఇటీవల ఎమ్మెల్యే పరిటాల సునీత చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు చేసిన మోసాలపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ఇటీవల రాప్తాడు నియోజకవర్గంలో వేలాదిమంది ప్రజల సమక్షంలో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పరిటాల సునీత ఎమ్మెల్యే అయిన తర్వాత హత్యలు, దాడులు, అక్రమ కేసుల బాధిత కుటుంబాలవారు తరలి వచ్చారన్నారు.

ఏరోజైనా రాత్రిపూట నీ భర్త నిద్రపోయాడా?

'నీభర్త పేరు చెబితేనే భయపడతామని చెబుతున్నావు... 1998-99లో నీ భర్త ఏరోజైనా రాత్రిపూట నిద్రపోయాడా?' అని ప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. ఎవరిని కలవరించుకుంటూ భయపడేవాడో ఆమెకే తెలియాలన్నారు. 'అరవిందనగర్‌లో మా ఇంటికి వంద అడుగుల దూరంలోనే నీ భర్త ఇల్లు కట్టాడు. నీ భర్తపై యుద్ధం చేసి 30 నెలలు నేను జైలు జీవితం గడిపా. నా తండ్రి అదే ఇంట్లోనే కాపురం ఉన్నాడు. నీ మొగుడు చనిపోయిన తర్వాత ఆ ఇంటినుంచి పక్కకు పోయాం. నువ్వేమో నీ భర్త గురించి గొప్పగా చెప్పుకుంటున్నావు. ఆయన తమ్ముడిని పోలీసులు చంపితే తోపుదుర్తి రాంభూపాల్‌రెడ్డి వద్దకు వెళ్లి...'పెద్దాయనా నేను గొర్లు కాసుకునేవాడిని. నాకు ఏ రాజకీయం వద్దు. నన్ను వదిలిపెట్టమని మద్దెలచెరువు నారాయణరెడ్డికి చెప్పు' అని బతిమాలలేదా? ఇదీ మీ ఆయన చరిత్ర' అన్నారు.

ఆర్‌ఓసీతో ఊచకోత కోయించారు..

పరిటాల రవి మంత్రిగా ఉన్నప్పుడు ఆర్‌ఓసీ అనే ప్రైవేట్ క్రిమినల్ సంస్థను ఏర్పాటు చేసుకుని ఊచకోత కోయించారని ప్రకాష్ రెడ్డి దుయ్యబట్టారు. 'నీ మొగుడిని చంపిన మద్దెలచెరువు సూరి కాళ్లు పట్టుకుని నువ్వు ఎమ్మెల్యే అయ్యావు. 2009 తర్వాత నీ రాజకీయ జీవితం మద్దెలచెరువు సూరి పెట్టిన భిక్ష. సూరి వద్దకు మీ బంధువులను పంపలేదా? మీ ఆయన హత్య కేసు ముద్దాయిలతో నువ్వు సయోధ్య కుదుర్చుకోలేదా? మద్దెలచెరువు సూరి శిష్యుడు శివలింగకు నీ తమ్ముడు బాలాజీ రూ. 5 లక్షలు ఇచ్చి ఇండిపెండెంట్‌గా పోటీ చేయించలేదా?మరో శిష్యుడు భానును ఉపయోగించుకోలేదా?ఇదీ మీ అసలు చరిత్ర. పవర్‌లో ఉంటే జుట్టు పట్టుకుంటావు. లేకపోతే మరోలా వ్యవహరిస్తావు. మీ వద్ద ఎంపీపీగా పని చేసిన దగ్గుపాటి ప్రసాద్ ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకోగలిగితే నీ కుమారుడికి ధర్మవరం టికెట్ తెప్పించుకోలేకపోయావు. ఇదీ మీ చరిత్ర. జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని చెబుతున్నావు... ప్రకాష్‌రెడ్డిని జైలుకు పంపాలంటే నీకు రూలింగ్ కావాలేమో. ప్రకాష్‌రెడ్డి జైలుకు వెళ్లేందుకు ఏ రూలింగ్ అవసరం లేదు. 20 ఏళ్లు జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధం' అన్నారు.

వేల కుటుంబాలు వీధులపాలు..

రాష్ట్రంలో రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులను ఆపేసి వేల కుటుంబాలను వీధులపాలు చేశారని ప్రకాష్ రెడ్డి విమర్శించారు. 'ఆలమూరు, కొడిమి జగనన్నకాలనీల్లో 10 వేల మందికి ఇళ్లు నిర్మించే అవకాశాన్ని కూడా అడ్డుకున్నారు. పాపం పేట వద్ద ఇళ్లు కూల్చేయించావు. అప్పటి నుంచి 110 ఎకరాల శోత్రియం భూముల్లో ఇళ్లు కట్టుకున్న వారందరూ భయపడుతున్నారు. అందుకే నీ భర్త కంటే కూడా నువ్వంటేనే భయపడుతున్నారు. మళ్లీ అధికారంలోకి రామనే తెలుసు కాబట్టే అందిన కాడికి దోచుకుంటున్నారు. ఎవరూ మీ తాటాకు చప్పుళ్లకు భయపడే పరిస్థితి లేదు. మాటలు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి' అని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ రామాంజనేయులు, నాయకులు రంగంపేట గోపాల్‌రెడ్డి, బండి పవన్, గోవిందరెడ్డి, గంగుల సుధీర్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి, జూటూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ(ఏ) కాన్‌స్టిట్యూట్ కళాశాలగా 'స్కిట్'

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) 'కాన్‌స్టిట్యూట్' జాబితాలోకి మరో కళాశాల చేరింది. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్)ని జేఎన్‌టీయూ కాన్‌స్టిట్యూట్ కళాశాలగా మార్చారు. ఇప్పటికే ఏపీఈఏపీసెట్ రెండో కౌన్సెలింగ్ జాబితాలో స్కిట్ కళాశాలను ఆప్షన్ ఇచ్చుకోవడానికి వీలుగా వెబ్‌సైట్‌లో చేర్చారు. దీనిపై వర్సిటీ ఉన్నతాధికారులకు ప్రాథమికంగా సమాచారం అందగా... ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వ ఉత్తర్వులు కూడా రానున్నాయి. 1997లో శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి ఆధ్వర్యంలో ఏర్పాటైన 'స్కిట్' కార్యకలాపాలు తొలుత సమర్థవంతంగా నడిచినా... కొన్నేళ్లకే అడ్మిషన్లు పడిపోయాయి. నిర్వహణ మొత్తం అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో 'స్కిట్'ను జేఎన్‌టీయూ కాన్‌స్టిట్యూట్ కళాశాలగా మార్చాలంటూ 10 సంవత్సరాల నుంచి పాలకమండలి ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తూ వచ్చింది.ఇందుకు సంబంధించి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని అనుమతులు మంజూరయ్యాయి. తాజాగా కార్యరూపం దాల్చింది.



శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ప్రధాన ద్వారం

ఐదో కళాశాల..

జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో ఇప్పటివరకూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల, ఓటీపీఆర్‌ఐ, పులివెందుల, కలికిరి ఇంజినీరింగ్ కళాశాలలు కాన్‌స్టిట్యూట్‌గా ఉన్నాయి. తాజాగా స్కిట్ చేరికతో ఆ సంఖ్య ఐదుకు చేరింది. కాన్‌స్టిట్యూట్ కళాశాలగా రూపాంతరంతో 'స్కిట్'కు సంబంధించిన స్థిర, చరాస్తులు అన్నీ ప్రభుత్వం ఆధీనంలోకి రానున్నాయి. కళాశాల నిర్వహణ మొత్తం జేఎన్‌టీయూ (ఏ) పరిధిలోకి వస్తుంది. ఇప్పటికే జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు 'స్కిట్'కు సంబంధించి ప్రిన్సిపాల్ నియామకం, ఫ్యాకల్టీ కేటాయింపు తదితర అంశాలపై దృష్టి సారించారు. 'స్కిట్'లో తొలుత ఐదు బ్రాంచ్‌ల ఏర్పాటుకు అనుమతి పొందారు. సీఎస్‌డీ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్), సీఎస్‌ఈ (కంప్యూటర్ సైన్సెస్ అండ్ ఇంజినీరింగ్), సీఎస్‌ఎం (సీఎస్‌ఈ-ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్), ఈసీఈ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్), ఈఈఈ (ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్)లో బ్రాంచ్‌కు 66 చొప్పున 330 సీట్లు అందుబాటులోకి తెచ్చారు. కోర్సు ఫీజు రూ.70 వేలుగా నిర్ధారించారు. సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో కోర్సు నిర్వహిస్తారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది.

అధికారుల అండతోనే బరితెగింపు!

- 'పచ్చ' గద్దల వ్యవహారంలో వెలుగులోకి విస్తుపోయే అంశాలు

అనంతపురం క్రైం: అధికారుల అండతోనే 'పచ్చ' గద్దలు బరితెగించినట్లు తెలిసింది. ఓ సివిల్ వివాదంలోకి రక్షణ పేరిట పోలీసులు తలదూర్చడం ఇందుకు బలం చేకూరుస్తోంది. వివరాలు.. అనంతపురం నగర శివారులోని ఎంకేఎం ఫంక్షన్ హాలు సమీపాన జాతీయ రహదారికి ఆనుకుని సర్వే నంబర్లు 209-210లోని రూ. కోట్ల విలువైన భూమిలోకి రెండు రోజుల క్రితం కొందరు వ్యక్తులు జేసీబీలతో ప్రవేశించడం కలకలం రేపింది. అయితే, ఈ వ్యవహారంలో పలు విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. జాతీయ రహదారికి ఆనుకుని భూమి ఉండడం, రూ. కోట్లు విలువ చేస్తుండడంతో భూమిని కాజేసేందుకు కొన్ని శక్తులు చేతులు కలిపినట్లు తెలిసింది. బాధితుల కథనం మేరకు..అక్రమార్కులకు నగర ప్రజా ప్రతినిధి ముఖ్య అనుచరుడు అండగా ఉన్నారు. అక్రమార్కులు ఆ భూమి వివరాలను స.హచట్టం ద్వారా తెలుసుకుని నకిలీ పత్రాలు సృష్టించారు. ముందుగా వీఆర్‌ఓ, డీటీ స్థాయి అధికారులకు ఎర వేశారు. వారి ద్వారా మ్యానువల్ వంశ వృక్షాన్ని పుట్టించారు. నకిలీ జీపీ కూడా సిద్ధం చేశారు. ఓ సబ్‌రిజిస్ట్రార్‌తో చేతులు కలిపి బేరం కుదుర్చుకున్నారు. చివరిగా ఓ పోలీసు అధికారిని కలసి రక్షణ కోరారు. సర్వే చేయించుకుంటామంటే కొందరు అడ్డొస్తున్నట్లు కట్టుకథ అల్లారు. శనివారం జేసీబీలతో భూమిలోకి దిగారు. ఇదేంటని స్థానికులు ప్రశ్నిస్తే పోలీసులతో హెచ్చరికలు చేయించారు. పక్కనే ఉన్న ఓ కల్యాణమండపం యజమానికి కూడా అక్రమార్కులు హెచ్చరికలు చేశారు. మండపంలో కూడా కొంత భాగం తమకొస్తుందంటూ బెదిరించారు. స్థానికంగా ప్లాట్ల రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న బండలు, సరిహద్దుల రాళ్లను ధ్వంసం చేసి భయాందోళన సృష్టించారు.



అనంతపురం శివారులో సర్వే నం.209-210లోని భూమి

ప్రైవేటు కేసులకు రెడీ..

కోర్టు తీర్పు కాపీలు తీసుకుని నెలల తరబడి తిరిగితేగాని రక్షణగా రాని పోలీసులు అక్రమార్కులు కోరగానే ఎందుకు తలదూర్చారన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఈ విషయంపై బాధితులు సంబంధిత శాఖల్లో ఎవరైతే అక్రమార్కుల అడుగులకు మడుగులొత్తారో వారిపై ప్రైవేటు కేసులు వేయాలని భావిస్తున్నారు. భూ వివాదంలో నకిలీలపై హైకోర్టును కూడా ఆశ్రయిస్తామని బాధితులు తెలిపారు.


నా సంతకం కాదేమో: వీఆర్‌ఓ

209-210 సర్వే నంబర్లకు సంబంధించి మీరిచ్చిన రిపోర్టు నిజమేనా అని 'సాక్షి' ప్రశ్నించగా సదరు వీఆర్‌ఓ స్పందించారు. రిపోర్టులోని సంతకం తనది కానట్టే ఉందన్నారు. రిపోర్టు ఇచ్చిన రోజు తాను ఇన్‌చార్జ్‌గా ఉన్నానని తెలిపారు.

వీధివీధినా పశువులే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీల్లోని ప్రతి వీధిలోనూ వీధి పశువుల బెడద తీవ్రమైంది. ఇప్పటికే కుక్కల గోలతో సతమతమవుతున్న ప్రజలు.. ఈ పశువుల బెడద ఎన్నడు తీరుతుందా అని ఎదురు చూస్తున్నారు. 'గో సంరక్షణ' పథకాన్ని గాలికొదిలేయడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.

- జిల్లాలో వేల సంఖ్యలో పశువులు రోడ్లపైనే..
- నిద్రమత్తులో అధికారులు
- పట్టించుకోని పాలకవర్గం



అనంతపురంలోని హెచ్చెల్సీ వద్ద కారుకు అడ్డుగా నిలిచిన పశువులు

అనంతపురం కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో వీధి పశువుల బెడద నానాటికీ జటిలమవుతోంది. అనంతపురం నగరపాలక సంస్థ, తాడిపత్రి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుత్తి, గుంతకల్లు, మడకశిర, హిందూపురం, కదిరి, పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తి, తదితర మున్సిపాలిటీల్లో వేల సంఖ్యలో పశువులు రోడ్డుపైనే ఉంటున్నాయి. వీటి పెంపకం దారులు మేత కోసం వాటిని రోడ్లపై వదిలేస్తున్నారు. ప్రధానంగా ఉభయ జిల్లా కేంద్రాల్లో ప్రధాన రోడ్లతో పాటు ప్రతి వార్డుల్లోనూ ఆవుల సంచారం పెరిగిపోయింది. రోడ్డుకు అడ్డంగా వస్తుండడంతో పలుమార్లు వాహనదారులు వాటిని ఢీకొని కిందపడి గాయపడిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. ఇక ప్రధాన మార్గాల్లో రోడ్డుకు అడ్డుగా వచ్చిన పశువులను తప్పించే క్రమంలో కిందపడిన వాహనదారులు అకాలమృత్యువాత పడిన ఘటనలూ ఉన్నాయి.

ప్లాస్టిక్, వ్యర్థాలతో ఆరోగ్యంపై ప్రభావం..

పట్టణ పరిసరాల్లో నివాసముంటున్న పశుపోషకులు వాటి సంరక్షణను గాలికి వదిలేశారు. ప్రభుత్వం సైతం గో సంరక్షణ పథకాన్ని అటకెక్కించడంతో పశుగ్రాసం అందక పలువురు రోడ్డుపైనే పశువులను వదిలేస్తున్నారు. దీంతో ఆకలితో అలమటిస్తున్న ఆవులు .. చెత్త దిబ్బల్లో, కంపోస్టు యార్డుల్లో ఉన్న చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తినడంతో వాటి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అంతేకాక వీటి పాలను ఆహారంగా తీసుకున్న ప్రజలు సైతం అనారోగ్యం బారిన పడుతున్నారు.

గోశాల ఉన్నా..

వీధి పశువుల సంరక్షణకు అనంతపురంలోని కలెక్టరేట్ ఎదురుగా గోశాలను ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ గోశాలకు ఆవులను తరలించి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవచ్చు. అయితే ఆ దిశగా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. గతంలో పశుపోషకులకు నగర పాలక సంస్థ అధికారులు నోటీసులు జారీ చేశారు కానీ, తదుపరి చర్యలు చేపట్టడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లతో తామేమీ చేయలేని అసహాయ స్థితిలో ఉన్నట్లుగా అధికారులు వాపోతున్నారు.

రోడ్ల పైనే పశువులు..

తాడిపత్రి టౌన్: తాడిపత్రి పట్టణంలో పదుల సంఖ్యలో ఆవులు రోడ్లపై తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కూరగాయల మార్కెట్, చింతల వేంకటరమణస్వామి ఆలయం, గాంధీ కట్ట, ఆర్టీసీ బస్టాండ్, గన్నెవారిపల్లి కాలనీ తదితర ప్రాంతాల్లో పశువుల బెడద తీవ్రంగా ఉన్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఆవుల నుంచి పాలు తీసుకున్న అనంతరం యజమానులు వాటిని నిర్లక్ష్యంగా రోడ్డుపైకి వదిలేస్తున్నట్లు తెలుస్తోంది. రోడ్లపై చెత్తా చెదారం, కుళ్లిన ఆహారం, ప్లాస్టిక్ కవర్లు తింటూ పశువులు అనారోగ్యం పాలవుతున్నాయి. వీటి ద్వారా వచ్చే పాలలో నాణ్యత లోపించి సేవించిన వారు అనారోగ్యం పాలవుతున్నారు.

వీడని పరేషాన్



రాయదుర్గంలోని వినాయక సర్కిల్ వద్ద సంచరిస్తున్న పశువులు

రాయదుర్గం టౌన్: పట్టణంలోని అనేక ప్రాంతాల్లో పశువుల సంచారంతో వాహనదారులు, పాదచారులు బెంబేలెత్తున్నారు. ప్రధాన రోడ్లతోపాటు ఇటీవల వీధుల్లో సైతం పశువుల సంచారం అధికమైంది. పశువుల పాలు పిండుకుని వాటిని యజమానులు వదిలేస్తుండడంతో అవి రోడ్లపై పడి ఉన్న వ్యర్థాలను తింటూ తిరుగుతున్నాయి. పట్టణంలోని ఆర్అండ్బీ అతిథి గృహం, వినాయక సర్కిల్, కణేకల్లు రోడ్డు, బళ్లారి రోడ్డు, కూరగాయల మార్కెట్లో నిత్యం పశువులతో స్థానికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పశువులను గోశాలలకు తరలించడంతోపాటు రోడ్లపై వదులుతున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

అన్ని చోట్ల సంచారం



గుంతకల్లులోని రైల్వేస్టేషన్కు వెళ్లే దారిలో రోడ్డుకు అడ్డంగా నిల్చొన్న ఆవులు

గుంతకల్లు టౌన్: పట్టణంలోని రహదారులు, ప్రధాన చౌరస్తాలతో పాటు కూరగాయల మార్కెట్లో పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. ఈ క్రమంలో రోడ్డుపై వెళ్తున్న వాహనాలకు ఆవులు, ఎద్దులు, లేగదూడలు అడ్డుగా రావడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గత నెల 18న సంతమార్కెట్లో రెండు ఎద్దులు పోట్లాడుకుంటూ కూరగాయలు కొనుగోలు చేస్తున్న మహిళ మీదకు దూసుకెళ్లడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ అంశాన్ని అదే నెల 26న జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు లేవనెత్తడంతో స్పందించిన అధికారులు వారం రోజుల్లోపు చర్యలు తీసుకుని రోడ్డుపైకి వచ్చిన ప్రతి పశువునూ గోశాలకు తరలిస్తామంటూ భరోసానిచ్చారు. అయితే నేటికీ ఇది కార్యాచరణలోకి రాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

క్లుప్తంగా

'సమగ్ర' పీటీఐలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న పీటీఐల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు శివకుమారి

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష ద్వారా పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్టైం ఇన్స్ట్రక్టర్లకు (పీటీఐ) ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ పీటీఐల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సైకం శివకుమారి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కృష్ణకళామందిరంలో పీటీఐల ఉమ్మడి జిల్లా అసోసియేషన్ మహాసభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షురాలు శివకుమారి మాట్లాడుతూ13 ఏళ్లుగా రెగ్యులర్ టీచర్లతో సమానంగా విధులు నిర్వహిస్తున్న పీటీఐలు ఇప్పటి వరకూ కనీస వేతనాలకు నోచుకోవడం లేదన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. మహాసభలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్, ప్రధానకార్యదర్శి పీఎస్ ఖాన్, మహిళా విభాగం చైర్పర్సన్ సురేఖరావు, పీటీఐల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, శ్రీదేవి, ప్రభాకర్, విజయకుమారి, సౌజన్య, రాజేంద్ర పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

పరిగి: కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలో ఓ మహిళ దారుణహత్యకు గురైంది. పోలీసులు తెలిపిన మేరకు.. రొద్దం మండలం తురకలాపట్నానికి చెందిన అంజప్పకు మడకశిర మండలం చందకచెర్లు గ్రామానికి చెందిన సన్నక్క (50)తో వివాహమైంది. అయితే ఇటీవల దంపతుల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో సన్నక్క భర్త నుంచి వేరుగా ఉంటోంది. ఏమైందో తెలియదు కానీ శనివారం రాత్రి పరిగి మండలం కొడిగెనహళ్లి పంచాయతీ బిందూనగర్ సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాల వెనుక మైదానంలో హత్యకు గురైంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పరిగి పోలీసులు ఆదివారం ఉదయం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. భర్త అంజప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా స్థాయి యోగా పోటీల ప్రారంభోత్సవంలో గవిమఠం ఉత్తరాధికారి



యోగా పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

ఉరవకొండ: సంపూర్ణ ఆరోగ్యంతో పాటు పరిపూర్ణ జీవన విధానానికి యోగ అత్యంత ఆవశ్యమని గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి అభిప్రాయపడ్డారు. స్థానిక ప్రభుత్వ సెంట్రల్ ఉన్నత పాఠశాల ఆవరణలో కేంద్ర క్రీడలు, యువజన విభాగ శాఖ సౌజన్యంతో ఏపీ యోగాసాన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్వర్యంలో 5వ జిల్లా స్థాయి యోగాసన చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా నలమూలల నుంచి 240 మంది యోగా సాధకులు పాల్గొన్నారు. పోటీలను మఠం ఉత్తరాధికారి జ్యోతి ప్రజల్వనతో ప్రారంభించి, మాట్లాడారు. పరిపూర్ణ జీవనశైలికి యోగా ఒక బాటగా నిలుస్తుందన్నారు. అనంతరం 10 నుంచి 28 ఏళ్ల లోపు ఉన్న వారికి ఏడు ఈవెంట్లతో పోటీలు నిర్వహించారు. జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట్ తాటికొండ, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, అబ్జర్వర్ బద్రీనాథ్, నాగభూషణ్, దివాకర్, ఆయూర్ అధ్యక్షుడు సుధాకర్రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు టీడీపీ నేతలపై కేసు నమోదు

గుత్తి: కుటుంబసభ్యులపై దాడి చేసి, బలవంతంగా ఇల్లు ఖాళీ చేయించిన 20 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఎట్టకేలకు శనివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. గుత్తిలోని జడ్.వీరారెడ్డి కాలనీలో నివాసముంటున్న దూదేకుల దస్తగిరి, టీడీపీ కార్యకర్త సుబ్బయ్య మధ్య ఇంటి విషయంలో వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో గత నెల 22న పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి దస్తగిరి ఇంటికి సుబ్బయ్య వెళ్లారు. ఇల్లు ఖాళీ చేయాలంటూ దౌర్జన్యం చేశాడు. దస్తగిరి అంగీకరించకపోవడంతో సుబ్బయ్యతో పాటు అతని వెంట వెళ్లిన వారు దౌర్జన్యంగా ఇంట్లోని సామగ్రినంతా బయటకు విసిరేశారు. అంతటితో ఆగకుండా దస్తగిరి కుటుంబ సభ్యులపై దాడి చేశారు. ఘటనపై బాధితుడు దస్తగిరి అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేసినా.. కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యం కనబరిచారు. దీంతో బాధితుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేసి కేసు నమోదు చేయాలని ఎస్పీని డీఐజీ ఆదేశించారు. ఎస్పీ జగదీష్ సూచన మేరకు పోలీసులు విచారణ చేపట్టి పలు సెక్షన్ల కింద సుబ్బయ్యతో పాటు నాగేంద్ర, గోవిందు, గౌరీ శంకర్, లక్ష్మీనారాయణ, ప్రకాష్, లక్ష్మి, వెంకీ, శివ, గోవర్దన్, దివాకర్, సూరి, షణ్ముఖ, ప్రకాష్, దుర్గా, బ్రహ్మయ్య, రంగస్వామి, కళ్యాణ్, సంజీవ రాయుడు, సూర్యప్రతాప్ పై కేసు నమోదు చేశారు.

విద్యార్థుల గొంతు నొక్కేందుకే జీఓ

- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉత్తర్వుల దగ్ధం



జీఓ ప్రతిని దగ్ధం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాలల్లో సమస్యలు వెలుగులోకి రాకుండా విద్యార్థుల గొంతు నొక్కేలా కూటమి ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని ఏఐఎస్ఎఫ్ నాయకులు మండిపడ్డారు. పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు ప్రవేశించకుండా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రతులను నగరంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి మాట్లాడారు. విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలు వెలుగులోకి వస్తే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందనే భయంతో కూటమి సర్కార్ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. విద్యార్థి హక్కులపై దాడిగా భావించాల్సి వస్తున్న ఈ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మంజునాథ్, నాని, సమీర్, తరుణకార్తీక్, యశ్వంత్, అక్బర్, సురేష్, ఉమేష్, భీమేష్ పాల్గొన్నారు.

విద్యను నిర్వీర్యం చేసేందుకే లోకేష్కు మంత్రి పదవి : ఏఐవీబీ

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయడానికే నారా లోకేష్కు విద్యాశాఖ మంత్రి పదవి కట్టబెట్టారని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐవీబీ) జిల్లా ప్రధానకార్యదర్శి పృథ్వీ ధ్వజమెత్తారు. ఆదివారం నగరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు తప్ప ఇతరులెవరూ పాఠశాలల్లోకి వెళ్లకుండా నిషేధించడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. విలీనం పేరుతో అనేక ప్రాథమిక పాఠశాలలను అన్యాయంగా మూసేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను జైళ్లల్లా మార్చడమే మంత్రి లోకేష్ లక్ష్యంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. విద్యార్థుల గొంతు నొక్కాలని చూస్తే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అసంబద్ధ జీఓను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఇంతియాజ్, నరేంద్ర పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులను తీర్చిదిద్దాలి

- విద్యాశాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు



మాట్లాడుతున్న దేవరాజు

కడప ఎడ్యుకేషన్: కేజీబీవీలలో చదువుతున్న విద్యార్థులను చదువులో దిట్టలుగా మార్చాలని కేజీబీవీ సబ్జెక్టు టీచర్లకు రాష్ట్ర విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు పిలుపు నిచ్చారు. కడప నగర శివారులోని గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో జీసీడీఓ దార్ల రూతు ఆరోగ్య మేరీ అధ్యక్షతన రాయలసీమ పరిధిలోని కేజీబీవీలలో పనిచేసే ఫిజిక్స్, కెమిస్ట్రీ టీచర్లకు ఇన్ సర్వీస్ రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాయలసీమ పరిధిలోని కడప, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, కర్నూలు, నంద్యాలతోపాటు నెల్లూరు జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన విద్యాశాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ.. కేజీబీవీలలో విద్యనభ్యసించే వారంతా చదువుతోపాటు ఆర్థికంగా వెనుకబడిన వారేనన్నారు. అలాంటి వారిని చదువుల్లో దిట్టలుగా చేయడం అదృష్టంగా భావించాలన్నారు. సమగ్రశిక్ష ఏపీసీ నిత్యానంద రాజులు మాట్లాడుతూ.. ఈ శిక్షణ ద్వారా తెలుసుకున్న మరిన్ని కొత్త విషయాలను తరగతి గదిలో విద్యార్థులకు బోధించడం ద్వారా వారి ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష కార్యాలయ సూపరింటెండెంట్ ప్రేమకుమారి, సెక్టోరియల్ అధికారి వీరేంద్రరావు, ఏఎస్ఓ సంజీవరెడ్డి, రిసోర్సు పర్సన్లు సమగ్రశిక్ష సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎకాలజీ సెంటర్లో ఉచిత శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: హౌస్ వైరింగ్, మోటార్ రివైండింగ్ లాంటి ఎలెక్ట్రికల్ కోర్సుల్లో ఏఎఫ్ ఎకాలజీ సెంటర్లో 45 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సెంటర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కనీసం 5వ తరగతి వరకు చదివి, 18 నుంచి 40 సంవత్సరాల్లోపు వయసున్న వారు అర్హులు. శిక్షణా కాలంలో మధ్యాహ్న భోజన వసతి ఉంటుంది. శిక్షణ పూర్తయిన తర్వాత సర్టిఫికెట్తో పాటు ఉచితంగా టూల్కిట్ అందిస్తారు. అలాగే 100 శాతం ఉపాధి అవకాశాల కల్పనకు చొరవ తీసుకుంటారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఎకాలజీ సెంటర్ కార్యాలయంలో పనివేళల్లో లేదా, 97044 07134, 77807 52418 నంబర్లలో సంప్రదించవచ్చు.

5న సర్పంచుల 'చలో విజయవాడ'

- సర్పంచుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్రెడ్డి



రమేష్రెడ్డి

గుంతకల్లు రూరల్: ఏడు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.1,121 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులను తక్షణమే విడుదల చేయాలని కూటమి ప్రభుత్వాన్ని జిల్లా సర్పంచుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్రెడ్డి డిమాండ్ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులను స్థానిక సంస్థలకు చెల్లించకుండా కూటమి ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ఈ నెల 5న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. గుంతకల్లు మండలంలోని తన సొంత పంచాయతీ ఓబుళాపురంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడు నెలల క్రితం గ్రామ పంచాయతీలకు గత డిసెంబర్లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.1121 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం తొక్కిపెట్టడంతో పంచాయతీల పరిధిలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. గడిచిన వేసవిలో తీవ్రమైన తాగునీటి ఇబ్బందులతో ప్రజలు అవస్థలు పడితే, ప్రస్తుత వర్షాకాలంలో పారిశుద్ధ్య లోపంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కార్మికుల జీత భత్యాలు కూడా చెల్లించలేని స్థితిలో పంచాయతీలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో జగన్ సర్కార్ గ్రామ పంచాయతీలను, స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేసిందని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్లు మాట్లాడటం జరిగిందని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీరు చేస్తుందేమిటో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులకు గౌరవ వేతనాన్ని పెంచాలని, ఉపాధి పథకం ద్వారా గ్రామ పంచాయతీల్లో పనులు నిర్వహించాలని, ఎన్నికల హామీల్లో భాగంగా ఐదవ ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసి పంచాయతీలకు నిధులను కేటాయించాలని, పంచాయతీలకు అందాల్సిన సర్ చార్జీలను నిరంతరం విడుదల చేయాలనే డిమాండ్ల సాధన కోసం ఈ నెల 5న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి సర్పంచులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు.

వ్యక్తి దుర్మరణం



ప్రమాదానికి గురైన వాహనం

రాయదుర్గం టౌన్: అతి వేగం ఓ వ్యక్తి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండలం మాలేపల్లి గ్రామానికి చెందిన బసవరాజు (32)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ మొబైల్ కంపెనీలో కేబుల్ నెట్వర్క్ ఇంజినీర్గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రాయదుర్గం మండలం గుండ్లపల్లి వద్ద జరుగుతున్న కేబుల్ పనులను ఆదివారం పర్యవేక్షించిన బసవరాజు... మధ్యాహ్నం డ్రైవర్ కమల్తో కలసి డీ-మ్యాక్స్ వాహనంలో భోజనానికని ఆవుల దట్ట గ్రామానికి బయలుదేరారు. కాశీపురం వద్దకు చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోయి వేగంగా దూసుకెళ్లడంతో వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొని పల్లంలోకి బోల్తాపడింది. ఘటనలో బసవరాజు వాహనంలోనే ఇరుక్కొని మృతి చెందాడు. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

యువకుడి బలవన్మరణం



హర్ష (ఫైల్)

నార్పల: క్షణికావేశంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. నార్పలలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా నివాసముంటున్న ఆదినారాయణ, బాలవీరమ్మ దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నాడు. ఇటీవల కుమారుడు హర్ష (27)కు వివాహం నిశ్చయమైంది. ఈ క్రమంలో తనకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారంటూ కొన్ని రోజులుగా మనోవేదనకు లోనైన హర్ష.. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు.. ఎంత సేపటికీ హర్ష తలుపులు తీయకపోవడంతో బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని గుర్తించి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

బంగారు గొలుసు అపహరణ



బాధితురాలిని విచారిస్తున్న పోలీసులు

గుంతకల్లు టౌన్: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం చైన్ స్నాచింగ్ జరిగింది. బాధితురాలు తెలిపిన మేరకు.. కాలనీలోని మసీదు పక్కన వన్నూర్రెడ్డి, రమాదేవి దంపతులు కిరాణా కొట్టు (రెడ్డి షాపు) ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఆదివారం సాయంత్రం కొట్టులో రమాదేవి కూర్చొని వ్యాపారాన్ని చూసుకుంటున్నారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకుల్లో ఒకరు కొట్టు దగ్గరికెళ్లి సిగరెట్లు కావాలని అడిగాడు. ఆ సమయంలో సిగరెట్ ప్యాకెట్ తీసుకునేందుకు రమాదేవి అటు తిరగగానే వెనుక నుంచి ఆమె మెడలోని 3 తులాల బరువున్న బంగారు గొలుసును లాక్కొని అప్పటికే సిద్ధంగా ఉన్న బైక్ పై ఎక్కి ఉడాయించాడు. రమాదేవి గట్టిగా కేకలు వేసినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న సీఐ మనోహర్, టూటౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నాన్నా అంటూ పరుగెత్తుకెళ్లి..

- వాహనం కిందపడి చిన్నారి మృతి

యాడికి: మండలంలోని లక్ష్ముంపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం వాహనం కింద పడి 2 ఏళ్ల చిన్నారి మృతి చెందింది. వివరాలు.. లక్ష్ముంపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్కు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో ఆదివారం తాను సాగుచేసిన టమాట పంటను తొలగించి వాహనంలో వేసుకుని మధ్యాహ్నం ఇంటి వద్దకు చేరుకున్నాడు. కుటుంబ సభ్యులతో మాట్లాడిన అనంతరం పంటను మార్కెట్కు తరలించేందుకు బయలుదేరుతుండగా తన తండ్రి వెళుతున్నట్లు గుర్తించిన రెండేళ్ల వయసున్న చిన్న కుమార్తె పరుగున ఇంటి బయటకు చేరుకుంది. అప్పటికే ముందుకు కదిలిన వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. చిన్నారిని ఆగమేఘాలపై అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో మృతి చెందింది. విషయం తెలియగానే ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

యువకుడి అనుమానాస్పద మృతి

నల్లమాడ: అమడగూరు మండలం మహమ్మదాబాద్ సచివాలయం సమీపంలో ఆదివారం ఉదయం వెలుగు చూసిన ఓ యువకుడి మృతిపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరం మండలం నాగలూరుకు చెందిన గుణిశెట్టి రాజేష్(36)కు ఏడేళ్ల క్రితం అమడగూరు మండలం మహమ్మదాబాద్ పంచాయతీ బావిచెరువుపల్లికి చెందిన కేశవయ్య కుమార్తె సుమిత్రతో వివాహమైంది. తాగుడుకు బానిసైన రాజేష్ తనను తరచూ వేధిస్తున్నాడంటూ కొన్నేళ్ల క్రితం భర్తను వదిలి తల్లిదండ్రుల వద్దకు సుమిత్ర చేరుకుంది. ఆదివారం బావిచెరువుపల్లిలోని అత్తారింటికి వెళ్లిన రాజేష్... భార్యను కాపురానికి రావాలని కోరాడు. ఇందుకు ఆమె కుటుంబ సభ్యులు నిరాకరించారు. అనంతరం ఏమి జరిగిందో ఏమో.. మహమ్మదాబాద్ సచివాలయం సమీపంలో చెట్టుకు వేసిన ఉరికి విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసుల దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

ప్రజారక్షణకు జన సేవాదళం



జన సేవాదళం సభ్యులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: ప్రజారక్షణ కోసం జన సేవాదళం ఏర్పాటైందని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అన్నారు. ఆదివారం స్థానిక కేంద్రీయ ఉద్యానవనం సమీపంలో జన సేవాదళం సభ్యులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన శిక్షణ కార్యక్రమంలో జాఫర్ పాల్గొని జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాసేవకు జీవితాన్ని అంకితమిచ్చిన కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు అందరికీ స్ఫూర్తి అన్నారు. ఆయన స్థాపించిన జన సేవాదళం ఈ రోజు ప్రజాసమస్యలపై స్పందించే శక్తివంతమైన వేదికగా మారిందన్నారు. శ్రమజీవుల సమస్యలపై స్పందించడం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, ఆరోగ్య, రక్తదాన శిబిరాలు నిర్వహించడం, పారిశుద్ధ్యం, సామాజిక చైతన్య కార్యక్రమాల్లో పాల్గొనడం జన సేవాదళం ముఖ్య ఉద్దేశమన్నారు. జన సేవాదళం ప్రతి వీధిలోనూ ప్రజల సమస్యలపై స్పందించే బృందాలుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌స్ట్రక్టర్ జాన్సన్ బాబు, దళం సీనియర్ నాయకుడు కేవై ప్రసాద్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ కుమార్, జిల్లా ఇన్‌స్ట్రక్టర్లు రమణ, ఆనంద్, నాయకులు లింగమయ్య, పద్మావతి, బి.రమణ, వి.కృష్ణుడు, అల్లీపీరా, కుళ్లాయిస్వామి, జానకి, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యుల ప్రమాణ స్వీకారం



ప్రింటింగ్ ధరల పట్టిక పోస్టర్లను విడుదల చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఆదివారం ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ముందుగా అసోసియేషన్ సభ్యులుగా ఎన్నికైన వారు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరేష్, సెక్రటరీ చాంద్‌బాషా, కోశాధికారి యశ్వంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామనారాయణను సన్మానించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. సభ్యులందరూ క్రమశిక్షణతో అసోసియేషన్‌ను ముందుకు నడిపించాలని సూచించారు. లీగల్ అడ్వైజర్ భాస్కర్ రాయుడు మాట్లాడుతూ.. ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. అనంతరం ఈ ఏడాదికి సంబంధించి నిర్ణయించిన ప్రింటింగ్ ధరల పట్టిక పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో స్వప్న ప్రింటర్స్ రవికుమార్, రాధా ప్రింటర్స్ ప్రసాద్, శ్రీరామ ప్రింటర్ ప్రసాద్, వాణి ప్రింటర్స్ భాస్కర్, పంచముఖి బాబా ప్రింటర్స్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరుకండి

రాప్తాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని తహసీల్దార్ విజయకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు అర్జీలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలన్నారు. అధికారులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తహసీల్దార్ కార్యాలయంలో ఉండాలన్నారు. గైర్హాజరైతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

పాడి ఆవుకు శస్త్రచికిత్స



ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ పద్మనాభం బృందం

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ శింగనమల ఆసుపత్రి ఏడీ డాక్టర్ జి.పద్మనాభం బృందం ఆదివారం కోడి పుంజు, పాడి ఆవుకు ఆపరేషన్ చేశారు. నగరానికి చెందిన రహిమాన్ అనే వ్యక్తి పెంచుకున్న కోడి పుంజును వైద్యం కోసం స్థానిక సాయినగర్ పశువుల ఆస్పత్రికి తీసుకురాగా... దాన్ని పరిశీలించిన డాక్టర్ పద్మనాభం తిన్న ఆహారం ఆహార వాహిక తర్వాత ఉండే బుడి (క్రాప్)లో పేరుకుపోయిందని గుర్తించారు. తిన్నది జీర్ణం కాక అటు కక్కలేక చివరకు ప్రాణం పోయే దశకు చేరుకున్నందున ఆపరేషన్ చేస్తేకాని బతకదన్నారు. చిన్నపాటి ఆపరేషన్ చేసి క్రాప్ దగ్గర పేరుకుపోయిన 250 గ్రాములు ఆహార పదార్థాలను బయటకు తీసి కోడి పుంజును బతికించారు. అలాగే బుక్కరాయసముద్రం మండలం పొడరాళ్లలో రామాంజనేయులుకు చెందిన పాడి ఆవుకు రొమ్ము ఆపరేషన్ చేశారు. పొదుగువాపుతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని డాక్టర్ పద్మనాభం దృష్టికి తీసుకెళ్లారు. పాడిఆవును పరీక్షించి పూర్తిగా కుళ్లిపోయిన కుడివైపు ఉన్న రొమ్ము భాగాన్ని తొలగించేందుకు ఆపరేషన్ చేశారు. కార్యక్రమంలో అంబులెన్స్ డాక్టర్లు సునీత, సుచరిత, తిరుపతి, ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలల ట్రైనీ డాక్టర్లు, మడకశిర పాలిటెక్నిక్ కళాశాల ట్రైనీ విద్యార్థినులు పాల్గొన్నారు.

సిటీ పార్కులో అపరిశుభ్రత

ఆత్మకూరు: జిల్లా కేంద్రానికి సమీపంలో 250 హెక్టార్లలో ఉన్న సిటీ పార్కులో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పార్కులో అపరిశుభ్రత తాండవిస్తోంది. సౌకర్యాలు కల్పించక పోవడంతో రోజు రోజుకు అధ్వానంగా తయారవుతోంది. ఆహ్లాదం కోసం వచ్చే పర్యాటకులకు నిరాశే ఎదురవుతోంది. పార్కులో ఎటు చూసినా మురుగు నీరు, పైపుల ద్వారా వచ్చిన నీరు నిల్వ ఉండటంతో పరిసరాలు కంపు కొడుతున్నాయి. పార్కులో సేదదీరేందుకు వస్తున్న పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్కును శుభ్రంగా ఉంచుకుంటే మరింత మంది సందర్శించేందుకు అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు. పార్కు నుంచి ప్రభుత్వానికి రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా.. వసతులు కల్పించేందుకు అధికారులు చొరవ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కులో కనీస వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. ఆట పరికరాలకు మరమ్మతులు చేయించాలని పర్యటకులు కోరుతున్నారు.



పార్కు పరిసరాల్లో నిల్వవున్న నీరు



తాగునీటి ట్యాంక్ వద్ద అపరిశుభ్రత

‘సమ్మర్ స్టోరేజీ’ వద్ద వ్యర్థాలు





సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద వ్యర్థాలను పడేసిన దృశ్యం, ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

అనంతపురం కార్పొరేషన్: కంపోస్టు యార్డులో బయోమైనింగ్ ద్వారా వేరు చేసిన వ్యర్థాలను నగరంలోని గుత్తి రోడ్డు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ వద్ద పడేశారు. భరించలేని దుర్వాసన రావడంతో ఆదివారం అక్కడి చుట్టుపక్కల ప్రాంతవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వ్యర్థాలను ఇక్కడ వేయకూడదంటూ అభ్యంతరం తెలిపారు. ఎక్కడైనా జనావాసాలకు దూరంగా వ్యర్థాలను వదిలేయాలి కానీ కాలనీలకు సమీపంలో పడేయడం ద్వారా దుర్వాసనతో ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే కంపోస్టు యార్డు నుంచి వచ్చే పొగ ద్వారా ఊపిరాడక ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పుడు కొత్త సమస్యను తెచ్చిపెట్టవద్దని నగరవాసులు అధికారులను కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేలుకుని తగు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి. కార్యక్రమంలో స్థానికులు సిరాజుద్దీన్, రామదాస్, సుధాకర్, ప్రసాద్ రెడ్డి, నాగరాజు, రమేష్‌కుమార్, వెంకట్, రాజేష్, రాధిక, తదితరులు పాల్గొన్నారు. ఇదే విషయమై సాక్షి ఎస్‌ఈ చంద్రశేఖర్‌ను సంప్రదించగా.. కంపోస్టులో చెత్త నిర్వహణ ద్వారా తీసిన వ్యర్థాలను మట్టిగా వాడుకోవచ్చన్నారు. సమ్మర్ స్టోరేజీ నీటిని వాడుకోకపోవడంతో ఆ ప్రాంతంలో మట్టిని వేశారన్నారు. మరోసారి పరిశీలించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

గాయకులను ప్రోత్సహించడమే లక్ష్యం



పాటలు పాడుతున్న గాయకులు

అనంతపురం కల్చరల్: స్థానిక లలితకళా పరిషత్తులో ఆదివారం ‘ఆకాశంలో ఒక తార’ పేరుతో సూపర్‌స్టార్ కృష్ణ సంగీత విభావరి జరిగింది. నా జీవన బృందావనిలో.. ఆకాశంలో ఒక తార.. తెలుగు వీర లేవరా వంటి ఆ పాత మధురాలైన గీతాలతో గాయకులు అలరించారు. పూర్తిగా మహిళలే కార్యక్రమాన్ని నిర్వహించి స్ఫూర్తిని చాటుకున్నారు. అనంత నాగ్ స్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన కృష్ణ మ్యూజికల్ నైట్‌లో పలువురు గాయకులు కృష్ణ సినిమాల్లోని పాటలను అద్భుతంగా ఆలపించి ఆకట్టుకున్నారు. డీఆర్వో మలోల, సీనియర్ న్యాయవాది ఎల్కేపీ కార్యదర్శి గాజుల పద్మజ, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కార్యక్రమం నిర్వహిస్తున్న హైమావతి ఆధ్వర్యంలోని మహిళల కృషిని అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఔత్సాహికులైన గాయకులను ప్రోత్సహించడమే లక్ష్యంగా సంగీత విభావరులు నిర్వహిస్తున్నామన్నారు. లోకల్ టాలెంట్‌ను బాహ్య ప్రపంచానికి చాటడమే ధ్యేయంగా సాగుతున్న కృషిలో గాయకులందరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం కళాకారులకు సత్కారాలు జరిగాయి. కార్యక్రమంలో సీనియర్ గాయకులు శ్రీదేవి, విజయలక్ష్మి, వీఆర్వో నాగిన్ ప్రసాద్, పద్మజ, లక్ష్మీనారాయణ, శ్రావ్య, పలు సంస్థల ప్రతినిధులు, లలితకళాపరిషత్తు కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

కార్గోలో ఖతర్నాక్‌లు..!

- కార్గో సిబ్బందితో చేతులు కలిపి జేబులు నింపుకుంటున్న ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది
- మామూళ్లతో సరిపెట్టుకుంటున్న ఉన్నతాధికారులు



అనంతపురం క్రైం: ఆర్టీసీ కార్గోలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆర్టీసీ సెక్యూరిటీ విభాగంలోని కొంత మంది కార్గో సిబ్బందితో చేతులు కలిపి అక్రమ మార్గాల్లో జేబులు నింపుకుంటున్నారు. నగరంలో ఆరు ఆర్టీసీ కార్గో కొరియర్ బుకింగ్ సర్వీసు కేంద్రాలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఏపీఎస్ ఆర్టీసీకి సంబంధించిన బుకింగ్‌లు మాత్రమే చేయాలి. అలా కాకుండా కొంత మంది కొరియర్ సర్వీసుల నిర్వాహకులు తెలంగాణ, ఆంధ్రతో పాటు డీఏఎల్ఎఏ లాజిస్టిక్స్ తదితర బయట సంస్థలకు చెందిన సరుకును బుక్ చేస్తున్నారు. దాదాపుగా నగరంలోని అన్ని కేంద్రాల్లో ఇదే తరహా వ్యాపారం జరుగుతోంది. కాగా ఆర్టీసీ కార్గో ఇన్‌చార్జ్ ఏటీఎంతో బాగా లావాదేవీలున్న కొంత మంది ప్రత్యర్థి వ్యాపార వర్గాన్ని దెబ్బతీసేందుకు ఫిర్యాదులు చేయడం పరిపాటి. అందిన ఫిర్యాదుల్లో భాగంగా ఆర్టీసీ అధికారి దర్యాప్తుకు వెళ్లడం.. సదరు బుకింగ్ సెంటర్‌ను తనిఖీ చేయడం జరుగుతోంది. గతంలో ఈ తరహా వ్యవహారాలకు పాల్పడుతున్న ఓ బుకింగ్ సెంటర్‌ను తనిఖీ చేసిన ఆర్టీసీ అనంతపురం డిపో డీఎం నాగభూపాల్ సర్వీసును రద్దు చేశారు. అయితే సదరు నిర్వాహకుడు తన భార్య పేరుపై తిరిగి సర్వీసును తెచ్చుకుని అదే సంస్థలకు సంబంధించిన బుకింగ్‌లు చేస్తున్నాడు. ఈ విషయంపై పోటీ బుకింగ్ సర్వీసు నిర్వాహకులు ఫిర్యాదులు చేయడంతో రంగంలోకి దిగిన ఏటీఎం అధికారి సదరు బుకింగ్ సెంటర్‌ను రెండు నెలల క్రితం సీజ్ చేశారు. బుకింగ్ సెంటర్‌లోని సరుకుతో పాటు కంప్యూటర్లు, ఐడీని సీజ్ చేశారు. మళ్లీ బుకింగ్ సెంటర్ నిర్వాహకుడిని పిలిపించుకుని సరుకు, కంప్యూటర్లు, ఐడీ తిరిగి ఇచ్చేందుకు కొంత మొత్తం తీసుకుని చేతులు దులుపుకున్నారు. సీజ్ చేసిన కౌంటరు తిరిగి తెరుచుకోవడంతో పోటీ సెంటర్ నిర్వాహకులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సదరు అధికారులు ఆరా తీయగా కార్గో కార్యాలయం వేదికగా పలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. కాగా గతంలోనే కార్గో ఇన్‌చార్జ్‌పై కారు అద్దెతో పాటు అక్రమంగా ఒక ఏసీని కూడా లంచంగా తీసుకుని తన కార్యాలయంలో ఏర్పాటు చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంలో అప్పటి ఆర్ఎం సుమంత్ ఆర్.ఆదోని సంజాయిషీ కూడా కోరారు. కాగా నేటికి తన చాంబర్‌లో ఏసీ ఉంది. ఈ ఏసీని అదే కార్గోలో పని చేసే ఓ వ్యక్తి పేరుమీద కొనుగోలు చేశారు. బహిరంగంగా కార్గోలో ఇన్ని అవకతవకలు జరుగుతుంటే ఒక్క అధికారి కూడా కన్నెత్తి చూడక పోవడంపై తోటి అధికారులు, కార్మికుల్లో పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

విమర్శకు ప్రధాన భూమిక రాయలసీమ



ఆలోకనమ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాచపాలెం తదితరులు

అనంతపురం కల్చరల్: విమర్శకు రాయలసీమ ప్రధాన భూమిక పోషించిందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో విమలా శాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సమితి, కళాజ్యోత్స్న సంస్థలు సంయుక్తగా నిర్వహించిన సాహితీ సమావేశంలో డాక్టర్ ఆనందరావు రచించిన ‘ఆలోకనమ్’ పుస్తకావిష్కరణ జరిగింది. వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతినారాయణ అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి ఆచార్య రాచపాలెం చంద్రశేఖర రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కల్లూరి ఆనందరావు సాహిత్యంలో జాతి, సమాజంపై ఉన్న దృక్పథం ఏమిటో కనపిస్తుందన్నారు. సామాజిక పరిణామాల నేపథ్యంలో గొప్ప విమర్శకుడిగా ఆవిర్భవించిన విధానం ప్రశంసనీయమన్నారు. దళిత బహుజన సాహిత్య విమర్శ చాలా లోతుగా ఉందని తెలిపారు. సీపీ బ్రౌన్ సాహిత్యాన్ని కూడా వెలుగులోకి తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. డాక్టర్ శాంతి నారాయణ మాట్లాడుతూ.. విమర్శలో తనదైన ప్రయాణంలో ఆనందరావు దళిత జీవనాన్ని అద్భుతంగా ఆవిష్కరించారని కొనియాడారు. అదేవిధంగా రాజారాం, పుస్తక రచయిత విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనందరావు, కేశవరెడ్డి, జింకా లక్ష్మీనారాయణ తదితరులు ప్రసంగించారు. అనంతరం సాహితీవేత్తలను సన్మానించారు. కార్యక్రమంలో దామోదర రెడ్డి, గల్లా హర్ష డాక్టర్ నందిరాజు కల్యాణి, డాక్టర్ నానీల నాగేంద్ర, చెట్ల ఈరన్న, శ్రీనివాస్, టీవీరెడ్డి, యశస్వి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా స్నేహితుల దినోత్సవం



ప్రజా రైతు సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



పుట్టినిల్లు ఆశ్రమంలో చిన్నారులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు పంపిణీ

అనంతపురం కల్చరల్: సృష్టిలో స్నేహాన్ని మించిన బంధం ఏదీ లేదని భారత్ రైతు ప్రజా సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం లెక్చరర్స్ కాలనీలోని సంఘం కార్యాలయంలో స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. వయస్సుతో సంబంధం లేకుండా వృద్ధులు ఉత్సాహంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. పలువురు కళాకారులు ఆటపాటలు, పద్యాలతో ఆకట్టుకున్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. స్నేహితులు అందరి జీవితాలలో చుక్కానిగా ఉంటారన్నారు. మంచి స్నేహాలను నిలబెట్టుకోవడానికి త్యాగం అవసరమన్నారు. అలాగే స్థానిక ఆదర్శనగర్ పుట్టినిల్లు ఆశ్రమంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా చిన్నారులందరికి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు, చాక్లెట్స్ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ నిర్మల మురళీ మాట్లాడుతూ.. చెడు స్నేహాలను వదిలించుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అన్న సంతర్పణ జరిగింది. కార్యక్రమంలో నిర్విఘ్న సాయి, శ్రావ్య, అనుజ్ఞ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. మహిళకు గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఎల్లమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్లమ్మ అనే మహిళ బిక్షాటన చేసుకుంటూ కొన్ని రోజులుగా రజాపురం గ్రామ శివార్లలో తిరుగుతూ ఉండేది. ఈ క్రమంలో తెల్లవారుజామున రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఆమెను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు.

టౌన్ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు

అనంతపురం అగ్రికల్చర్: ది అనంతపురం అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంకు (టౌన్ బ్యాంకు) ద్వారా పేద, మధ్య తరగతి వర్గాలకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ భవన్‌లో 109వ వార్షిక మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. నగరంలో పేద, మధ్య తరగతి వర్గాల అభివృద్ధికి పాలకవర్గం తరఫున పెద్దపీట వేస్తున్నామన్నారు. నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) పూర్తిగా తగ్గించేశామన్నారు. దీంతో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి షేర్ హోల్డర్లకు 9.5 శాతం డివిడెంట్ ప్రకటించామని తెలిపారు. అన్ని ప్రధాన బ్యాంకులకు ధీటుగా టౌన్ బ్యాంకులో అన్ని రకాల ఆధునిక బ్యాంకింగ్ సదుపాయాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. టౌన్ బ్యాంకు అందిస్తున్న సేవలను డీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు ప్రశంసించారు. కార్యక్రమంలో డీసీఓ అరుణకుమారి, బ్యాంకు సీఈఓ ఎం.విజయ భాస్కర్, వైస్ చైర్మన్లు వడ్డే సుబ్రహ్మణ్యం, ఎం.చంద్రశేఖర్, డైరెక్టర్లు సుంకర రమేష్, పి.క్రిష్ణకుమార్, బి.రమణయ్య, గోల్డ్‌బాషా, రామాంజనేయులు, రొళ్ల భాస్కర్, అనిల్ నాయుడు పాల్గొన్నారు.

‘రాజ్యాధికారం కోసం పోరాడాలి’

అనంతపురం టవర్‌క్లాక్: ఎన్ని తరాలు మారిన బీసీల జీవితాలు మారలేదని బీసీవై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక లలిత కళాపరిషత్‌లో ఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో బహుజన ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా లెక్కల ప్రకారం బీసీలు 55 శాతం ఉన్నప్పటికీ రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతోందన్నారు. ఇప్పటికైనా బీసీలు మేల్కొని రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ చైర్మన్ ప్రసాద్, ఎమ్మెల్సీ పోతుల సురేష్, సమాజ్‌వాజ్ పార్టీ చింతల వెంకటేష్, కర్ణాటక కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు అక్బర్ బాషా, ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి మధు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశాంత్ సింహ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాటక అకాడమీ మాజీ చైర్మెన్ హరిత, పోతుల నాగరాజు పాల్గొన్నారు.

పంపనూరుకు శ్రావణ శోభ

- సుబ్రహ్మణ్యేశ్వరుడి దర్శనానికి గంటల సమయం
- వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



కాలసర్పదోష నివారణ హోమం చేస్తున్న అర్చకులు

ఆత్మకూరు: పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం స్వామి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో గంటల సమయం పట్టింది. తొలుత సుబ్రహ్మణ్యేశ్వరుడు, మంజునాథ స్వామి, పార్వతీ దేవికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. సుబ్రహ్మణ్యేశ్వరుడి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష రాహుకేతు నివారణ హోమాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ భక్తులు 108 ప్రదక్షణలు చేసి, జమ్మి చెట్టు వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ప్రసాదం అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సంతల ఆదాయం రూ.2.72 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.2.72 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ కె.గోవిందు తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత ద్వారా రూ.1,58,300 వసూలు కాగా ఆదివారం జరిగిన ఆవులు, ఎద్దుల సంత నుంచి రూ.1,14,300 మేర వసూలైందన్నారు. శ్రావణమాసం ప్రభావంతో క్రయ విక్రయాలు తగ్గినట్లు తెలిపారు.

నేడు ధర్మవరంలో దివ్యాంగుల క్యాంపు

కనగానపల్లి: ధర్మవరం పట్టణంలోని భవిత కేంద్రంలో సోమవారం నిర్వహించే దివ్యాంగుల క్యాంపుకు మండలంలోని దివ్యాంగుల పిల్లలను తీసుకుని రావాలని ఐఈఆర్‌టీ ఉపాధ్యాయుడు జగదీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపు ద్వారా దివ్యాంగులైన పిల్లలకు అవసరమైన పరికరాలను అందజేసేందుకు వారి వివరాలు, పేర్లు నమోదు చేసుకుంటారని పేర్కొన్నారు. పిల్లల వికలాంగ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఫొటోలు తీసుకుని ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

‘నిలువెత్తు’ నిర్లక్ష్యం



పంచాయతీ రాజ్ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

రాప్తాడు: చిన్మయనగర్ సమీపంలోని పంచాయతీ రాజ్ కాలనీలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. జేఎన్‌టీయూకు వెళ్లే రహదారిలో ఓ జనరల్ స్టోర్ వద్ద విద్యుత్ స్తంభం ఓ వైపు ప్రమాదకరంగా ఒరిగి ఉంది. రోజూ రాప్తాడు, పరిసర ప్రాంతాల నుంచి జేఎన్‌టీయూ మీదుగా అనంతపురానికి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ స్తంభం కూలితే అంతే సంగతులు. ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. విద్యుత్ స్తంభాన్ని మార్చాలని కాలనీ వాసులు కోరుతున్నా.. ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదు.

బ్రాందీ షాపులో చోరీ

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని మెయిన్ రోడ్డులో పూలే విగ్రహం సమీపంలో ఉన్న భవానీ బ్రాందీ షాపులో శనివారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. రూ.48,500 నగదుతో పాటు బ్రాందీ బాటిళ్లు అపహరించారు. వివరాల్లోకి వెళితే.. ఓ దొంగ ముఖానికి ముసుగు ధరించి దుకాణానికి కన్నం వేశాడు. లోపలికి ప్రవేశించి క్యాష్ బాక్స్‌లో ఉన్న రూ. 48,500 నగదుతో పాటు బ్రాందీ బాటిళ్లు ఎత్తుకెళ్లాడు. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. బ్రాందీ షాపును అనంతపురం క్లూస్ టీం సభ్యులు యూనిస్, బాషా పరిశీలించి, వేలిముద్రలు సేకరించారు. బాధితుడు రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.